దిశ యాప్‌తో మహిళలకు రక్షణ

పాలకొండ: దిశ యాప్‌ను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఈ యాప్‌తో మహిళలకు రక్షణ కలుగుతుందని పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు పేర్కొన్నారు. స్థానిక సత్యసాయి కాలేజీలో దిశ యాప్ రిజిస్ట్రేషన్లు శుక్రవారం చేయించారు. అనంతరం విద్యార్థులతో ఆయన మాట్లాడారు. దిశ యాప్‌ను ఏ సమయంలో ఏ విధంగా వినియోగించాలి... తదితర విషయాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సీఐ మురళీధర్, ఎస్‌ఐ శివప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన

వీరఘట్టం: ప్రతీ మహిళా తన మొబైల్ దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎస్.ఐ ఎంవీ రమణ సూచించారు. శుక్రవారం మండల వ్యాప్తంగా ముమ్మరంగా ఆటోలు, బస్సులు, బైక్‌లపై ప్రయాణిస్తున్న వారికి అవగాహన కల్పించారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థినిలకు కూడా దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్న వారికి దిశ యాప్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆయనతో పాటు హెచ్‌సీ కృష్ణంనాయుడు, పోలీసులు పాల్గొన్నారు.



పాలకొండ: దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

గుమ్మలక్ష్మీపురం: దిశ యాప్‌తో అత్యవసర సమయాల్లో మహిళలకు రక్షణ కలుగుతుందని ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ అన్నారు. గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఆధ్వర్యంలో దిశ యాప్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న సీఐ విద్యార్థులచే దిశ యాప్‌ను విద్యార్థినిల ఫోన్లో రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థినిలు, మహిళల పట్ల ఎవరైన ఇబ్బందికరంగా ప్రవర్తిస్తే ఫోన్లో ఉన్న దిశ యాప్ ద్వారా పోలీసులకు సమాచారం అందించినట్లయితే తమను తాము రక్షించుకోగలుగుతారని, పోలీసుల సేవలు తక్షణమే చేరుతాయని చెప్పారు. అలాగే ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం మాట్లాడుతూ ఆడపిల్లలకు రక్షణ కల్పించేందుకు రూపొందించిన దిశ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినిలచే దిశ యాప్‌ను రిజిస్ట్రేషన్ చేయిస్తున్న సీఐ

ఎస్‌ఐ ఎస్.షన్ముఖరావు, వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

దిశ యాప్‌తో రక్షణ

భామిని: దిశ యాప్‌తో ఆపదలో ఉన్న మహిళలను సత్వరమే రక్షించవచ్చని బత్తిలి ఎస్‌ఐ యతిరాజుల అమ్మనరావు అన్నారు. మండలంలోని బత్తిలి, కాట్రగడ, గురండి, సింగిడి, భామిని, లివిరి, బాలేరు, పెద్దదిమిలి జంక్షన్లలో శుక్రవారం వాహనాలను తనిఖీ చేస్తూ దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. మహిళా పోలీసులు, హోంగార్డులు సహకరించారు.

క్లుప్తంగా

యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభ రేపు

వీరఘట్టం: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో ఈ నెల 5న జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు మజ్జి పైడిరాజు, కురమాన గోవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ వేడుకలు జరుగుతాయని, సంఘ సభ్యులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుళ్లిన కోడిగుడ్లు



లబ్ధిదారులకు ఇచ్చిన కుళ్లిన కోడిగుడ్లు

సీతంపేట: మండలంలోని కొత్తగూడ గ్రామంలోని గర్భిణులకు, చిన్నారులకు సంబంధిత అంగన్‌వాడీ కేంద్రం నుంచి కుళ్లిన కోడిగుడ్లు సరఫరా చేసినట్టు గిరిజన ప్రజాసమాఖ్య నాయకుడు మోహన్‌పాల్ ఆరోపించారు. లబ్ధిదారులకు తమకు ఇచ్చిన కోడిగుడ్లు పాడైపోవడంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. పోషకాహారంలో భాగంగా ఇటువంటి నాసిరకం కోడిగుడ్లు సరఫరా చేస్తున్న టెండర్‌దారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై సీడీపీఓ రంగలక్ష్మి వద్ద ప్రస్తావించగా ఇప్పటికే సరఫరా చేసిన వాటిని వెనక్కి తీసుకుని కొత్తవి మళ్లీ పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

వైఎస్సార్ బీమా అందజేత



తవిటినాయుడు కుటుంబానికి వైఎస్సార్ బీమా సాయం అందజేస్తున్న గౌరీశంకరరావు

జియ్యమ్మవలస: కన్నపుదొరవలస గ్రామానికి చెందిన బంటు తవిటినాయుడు 108లో పని చేసి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వారి కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రూ.10వేలు అందజేసారు. కార్యక్రమంలో సర్పంచ్ అన్నపూర్ణ, ఎంపీటీసీ రవికుమార్ ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలి

పార్వతీపురంటౌన్: విద్యార్థులు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని నాబార్డ్ డీడీఎం టి.నాగార్జున అన్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని ఎస్‌వీడీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్థికఅక్షరాస్యత కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయస్సు నుంచే పొదుపుచేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. అలా చేసిన పొదుపును సురక్షితంగా ఉండే పథకాల్లో ఎలా భద్రపరుచుకోవాలో వివరించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి నియంత్రిత సంస్థల్లో మాత్రమే డిపాజిట్లు చేయడం లేదా అప్పు తీసుకోవడం చేయాలని హితవు పలికారు. ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్నాయని, బ్యాంకు కస్టమర్లు ఎవరికీ ఓటీపీ, ఏటీఎం పిన్, పాస్‌వర్డ్ చెప్పరాదని హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో వచ్చిన తెలియని లింక్‌లను క్లిక్‌చేసి కష్టార్జితాన్ని సైబర్ మోసగాళ్లకు అర్పించవద్దని కోరారు. ఒక వేళ పొరపాటున ఏదైనా సైబర్ క్రైమ్ జరిగితే తక్షణమే 1930 నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందివ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ బ్రాంచ్ రీజనల్ మేనేజర్ బి.రాఘవేంద్ర, ఎస్‌వీడీ కళాశాల ప్రిన్సిపాల్ డా.చలపతిరావు, పట్టణ ఎస్సై దినకర్, ఏపీజీవీబీ పార్వతీపురం బ్రాంచ్ మేనేజర్ టి.కృష్ణసాగర్, నోడల్ అధికారి జె.వాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యశాఖ సేవలు మరువలేనివి



అరసాడ పీహెచ్‌సీ వైద్యాధికారిని, సిబ్బందిని అభినందిస్తున్న జమ్మాన

బలిజిపేట: వైద్యశాఖ సేవలు అభినందనీయమని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ ప్రశంసించారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా వైద్యశాఖ సిబ్బంది అందించిన సేవలను గుర్తిస్తూ బలిజిపేట మండలంలోని అరసాడ పీహెచ్‌సీ వైద్యాధికారి శశిధర్‌ను, సిబ్బందిని ఆయన శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా వారికి మెమెంటోలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్‌తో బహుళ ప్రయోజనాలు

గుమ్మలక్ష్మీపురం: కిచెన్ గార్డెన్ల వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ విభాగం రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్ అన్నారు. మండలంలోని చింతలపాడు గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ కిచెన్ గార్డెన్లో పండించే ఆకుకూరలు, కాయగూరలు మధ్యాహ్న భోజనం కూరల్లో ఉపయోగించడం వల్ల పిల్లలకు పౌష్టికాహారం లభిస్తుందన్నారు. చిన్నతనం నుంచే ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించే విధానం అలవాటు అవుతుందని, ఇక్కడి విషయాలు తల్లిదండ్రులతో ముచ్చటించుకోవడం వలన వారి యొక్క సొంత క్షేత్రాల్లో కూడా సాగు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. దుడ్డుఖల్లు గ్రామంలో రైతులు సాగు చేస్తున్న పంటలను కూడా పరిశీలించారు. నిరంతరం ఆదాయం వచ్చేలా ఏడాది పొడువునా సాగు చేసుకోవాలని, అవసరమైన సలహాలను ప్రకృతి వ్యవసాయం ద్వారా అందజేస్తామని పేర్కొన్నారు. డీపీఎం పి.షన్ముఖరాజు, ఎంటీలు స్వామినాయుడు, ఎల్.నరసింహా, జి.నిర్మల, సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.



చింతలపాడు పాఠశాలలో కిచెన్ గార్డెన్ సాగుపై విద్యార్థులకు అవగాహన

వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలు

పాలకొండ: జగనన్న గృహ నిర్మాణ పథకంలో పేదలకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్, హౌసింగ్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల వారీగా లక్ష్యాలను నిర్దేశించామని అందుకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ మధుసూధనరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉమామహేశ్వరి

సమగ్ర భూ సర్వేతో సత్ఫలితాలు : జేసీ

వీరఘట్టం: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహనరెడ్డి తలపెట్టిన సమగ్ర భూసర్వేతో సత్ఫలితాలు వస్తున్నాయని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు పేర్కొన్నారు. వీరఘట్టం మండలం యు.వెంకమ్మపేటలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన భూసర్వేతో లబ్ధి పొందిన రైతులతో శుక్రవారం మాట్లాడారు. సర్వే వల్ల తగాదాలు లేని భూమి తమకు దక్కిందని రైతులు సంతృప్తి వ్యక్తం చేసారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా సర్వే బృందాలు రీ-సర్వేను వేగవంతంగా చేపట్టాలని జేసీ సూచించారు. తహసీల్దార్ సత్యనారాయణతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు సొంట్యాన సింహాచలం తదితరులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జేసీ గోవిందరావు

ముగిసిన ‘జగనన్న ఆరోగ్య సురక్ష’

- 22 శిబిరాల ద్వారా 9776 మందికి వైద్య సేవలు

గుమ్మలక్ష్మీపురం: ప్రజలకు గ్రామాల్లోనే నిపుణులైన వైద్యులచే వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గుమ్మలక్ష్మీపురం మండలంలో ముగిసిందని ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు, తహసీల్దార్ జె.రాములమ్మ తెలిపారు. కలెక్టర్ నేతృత్వంలో వైద్య ఆరోగ్య శాఖ, మండల పరిషత్, గ్రామ పంచాయతీ, రెవెన్యూ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సమన్వయంతో గుమ్మలక్ష్మీపురం మండలంలో ఎంపీడీఓ, తహసీల్దార్ రెండు బృందాలుగా ఏర్పడి సెప్టెంబర్ 30న ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నవంబర్ 1తో ముగిసింది. మండలంలో మొత్తం 24 గ్రామ సచివాలయాలు ఉండగా వాటి పరిధిలోని 22 గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించారు. శిబిరాల ద్వారా మొత్తం 9,776 మందికి వైద్య సేవలను అందించారు. సుమారు 130 మందికి ఉన్నత వైద్యం కోసం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్న వారందరికీ మందులు పంపిణీ చేశారు. స్పెషలిస్ట్ డాక్టర్లు గ్రామాలకు వచ్చి వైద్య సేవలందించడంతో ప్రజల నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను మంచి స్పందన వచ్చిందని, విజయవంతంగా నిర్వహించడం జరిగిందని ఎంపీడీఓ, తహసీల్దార్ పేర్కొన్నారు.



చినగీసాడలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో బాలింతలకు వైద్యసేవలు (ఫైల్)

ఊరూరా వైద్యం

- డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి పల్లెలో వైద్యసేవలు అందిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన వీరఘట్టం మండలం నడిమికెల్ల గ్రామ సచివాలయం ఆవరణలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని సంతృప్తి వ్యక్తం చేశారు.

- ‘జగనన్న ఆరోగ్య సురక్ష’తో విస్తృత సేవలు



వీరఘట్టం: నడిమికెల్లలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు మెడికల్ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ దమలపాటి, వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్లాల వద్దే ధాన్యం కొనుగోలు



సమావేశమైన వ్యవసాయ శాఖ సిబ్బంది

వీరఘట్టం: ఈ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రణాళిక ప్రకారం చేపట్టడంతో పాటు రైతుల కళ్లాల వద్దకు వెళ్లి ధాన్యం నాణ్యతను పరిశీలించేందుకు సిబ్బంది అంతా సిద్ధంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి జె.సౌజన్య అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద వీఏఏలు, టెక్నికల్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు వాహనాలు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతీ వాహనానికి జీపీఎస్ ఉంటుందని తెలిపారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పక్కాగా చేపడదామని పిలుపునిచ్చారు.

చట్టాలపై అవగాహన అవసరం



న్యాయవిజ్ఞాన సదస్సులో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి కృష్ణసాయితేజ

పాలకొండ రూరల్: ప్రతీ ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పాలకొండ జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ అన్నారు. మండలంలోని అన్నవరం గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి పలు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా మహిళలు, బాలికలకు భద్రతకు కల్పించబడ్డ చట్టాలపై న్యాయవాదులు కర్రా రవి, వెంకటేష్, శివదాసు తదితరులు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గవర రాజశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.


దొంగల హల్‌చల్



సంతోషపురంలో ధ్వంసం చేసిన గాజుల దుకాణం

గరుగుబిల్లి: మండలంలో చిల్లర దొంగలు హల్‌చల్ చేయడంతో ప్రజలు భీతిల్లుతున్నారు. సంతోషపురం బస్ స్టాప్ పరిధిలో గాజుల షాపులో గురువారం రాత్రి దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. స్థానికులు తెలిపిన వివరాలు.. దత్తి గాయత్రికి చెందిన గాజుల షాపులో 1గ్రామ్ గోల్డు వస్తువులు, ఇతర వస్తువులు సుమారు రూ.15 వేలు విలువ గల వాటిని దొంగలించారని తెలిపారు. గతంలో ఆగస్టు 30న సంతోషపురం బస్‌స్టాప్, ఖడ్గవలస కూడలి వద్ద పలు షాపుల్లో ఒకే రోజు దొంగలు చోరీ చేసారు. పోలీసులు తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కుక్కల దాడిలో 15 మేక పిల్లల మృతి



మృతి చెందిన మేక పిల్లలు

గురుగుబిల్లి: మండలంలోని రావుపల్లిలో కుక్కల దాడిలో 15 మేక పిల్లలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన చిన్న మహాలక్ష్మి పెంచుకుంటున్న మేక పిల్లలపై కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో మృతి చెందాయి. అధికారులు స్పందించి కుక్కలను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు. మృతి చెందిన మేక పిల్లలను స్థానిక పశువైద్య సిబ్బంది పరిశీలించారు.

ప్రారంభానికి సిద్ధమైన సచివాలయం

వీరఘట్టం: మండలంలోని చిదిమి గ్రామంలో అత్యాధునిక హంగులతో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఈ భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. కొద్ది రోజుల్లో ఈ భవనాన్ని ప్రారంభిస్తామని జేఈ కళ్యాణిదుర్గ శుక్రవారం తెలిపారు. కాంపౌండ్ వాల్ నిర్మాణానికి మరో రూ.3.6 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సచివాలయం ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసి ముఖ్యమంత్రి లక్ష్యాన్ని నెరవేరుస్తామని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, సర్పంచ్ దమలపాటి ఉమామహేశ్వరరావు తెలిపారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న చిదిమి సచివాలయం

కేజీబీవీని సందర్శించిన ఆర్‌డీఓ

కొమరాడ: మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని పార్వతీపురం ఆర్‌డీఓ హేమలత శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా 6, 9 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన సీస్ పరీక్షను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ మంచిగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. రాబోయే టెన్త్ పరీక్షల్లో సత్ఫలితాలు సాధించాలన్నారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ అరుణ కుమారి తదితరులు ఉన్నారు.



కేజీబీవీలో సీస్ పరీక్షను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ హేమలత

ఇళ్ల బిల్లుల చెల్లింపుపై సమీక్ష

భామిని: మండలంలో మంజూరైన జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణ పనులు, బిల్లుల చెల్లింపుపై మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ చంద్రశేఖరనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్ష జరిగింది. ఇంజినీరింగ్ సహాయకులతో ఆయన సమీక్షించారు. మండలంలో 13 లేఅవుట్లలో మంజూరైన 324 జగనన్న కాలనీ ఇళ్ల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారు నిర్మించిన మేరకు బిల్లులు చెల్లింపులు చేపట్టిన వివరాలపై సమీక్షించారు. గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. కొన్ని గ్రామాల్లో ఇళ్ల స్థలాల కేటాయింపులపై వచ్చిన సమస్యలపై చర్చించారు. గృహ నిర్మాణ శాఖ సిబ్బంది, వీఈఓలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రరావు, ఏఈ చంద్రశేఖరనాయుడు

విద్యా సామర్థ్యాలను వెలికి తీసేందుకే ‘సీస్’



పాలకొండ రూరల్: తుమరాడ పాఠశాలలో సీస్ పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈఓ



గుమ్మలక్ష్మీపురం: బాలేసులో నిర్వహించిన సీస్ పరీక్షను పరిశీలిస్తున్న ఎంఈఓ

పాలకొండ రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాలను వెలికి తీసేందుకే సీస్(ఎస్ఈఏఎస్) పరీక్షలు శుక్రవారం అన్ని పాఠశాలల్లో నిర్వహించినట్టు ఎంఈఓ కృష్ణారావు అన్నారు. మండల వ్యాప్తంగా 28 పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన స్టేట్ ఎడ్యుకేషన్ ఎచీవ్‌మెంట్ పరీక్షలను ఎంఈఓ పర్యవేక్షించారు. ఓఎంఆర్ విధానంలో జరిగిన ఈ పరీక్షల్లో 1225 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేసేందుకు చేపట్టిన ఈ పరీక్షలు ఉత్తమ ఫలితాలు ఇస్తాయన్నారు. పలు పాఠశాలల్లో ఈ పరీక్షలను నిర్వహించగా వీటి ద్వారా ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. ఆయన వెంట హెచ్‌ఎం గోవిందరాజులు, సీఆర్‌పీ బి.సుధాకర్ ఉన్నారు.

ప్రశాంతంగా సీస్ పరీక్ష

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థుల్లోని విద్యా సామర్థ్యాలు గుర్తించేందుకు శుక్రవారం నిర్వహించిన సీస్ (స్టేట్ ఎడ్యుకేషన్ ఎచీవ్‌మెంట్) పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు పలు పాఠశాలల్లో నిర్వహించిన పరీక్షను ఎంఈఓలు బి.చంద్రశేఖర్, బి.జనార్దన నాయుడు పరిశీలించారు. మండలంలోని 3, 6, 9 తరగతులకు చెందిన మొత్తం 934 మంది విద్యార్థులు సీస్ పరీక్ష రాసినట్టు ఎంఈఓలు తెలిపారు.



కురుపాం: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

పరీక్షకు 881మంది హాజరు

కురుపాం: రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సీస్ పరీక్ష మండలంలోని 21 పాఠశాలలకు చెందిన 3, 6, 9 తరగతుల విద్యార్థులు 881మంది హాజరయ్యారు. మండలంలోని పలు కేంద్రాలను ఎంఈఓ ఎస్.సత్యనారాయణ, ఏఎంఓ బి.శ్రీనివాసరావు పరిశీలించారు. పరీక్ష కేంద్రాలను ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ 3వ తరగతి 297, 6వ తరగతి 289, 9వ తరగతి 295 కలిపి మొత్తంగా 881 మంది విద్యార్థులు హాజరు కాగా పరీక్షలు పకడ్బందీగా నిర్వహించామన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

వీరఘట్టం: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించి, పెండింగ్ బకాయిలు త్వరగా ప్రభుత్వం చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మీడియా కన్వీనర్ అన్ను వెంకటరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న శ్రీకాకుళంలో జరగనున్న కార్యవర్గ సమావేశంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.